ప్రజాశక్తి

బుధవారం 22 నవంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

కౌలు రైతును బలిగొన్న అప్పులు

పురుగు మందు తాగి అన్నదాత ఆత్మహత్య

ప్రజాశక్తి-భట్టిప్రోలు (చుండూరు)

వ్యవసాయంలో నష్టాల కారణంగా ఉన్న ఎకరన్నర పొలాన్నీ అమ్మి కొంత అప్పులు తీర్చాడు. మళ్లీ కౌలుకు భూమి తీసుకొని వ్యవసాయం చేశాడు. నష్టాలు తీవ్రమై.. అప్పులు ఎక్కువయ్యాయి. అప్పులు తీరే మార్గం లేక పురుగు మందు తాగి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చుండూరు మండలం, ఎడ్లపాడులో మంగళవారం జరిగింది. ఎడ్లపల్లి గ్రామానికి చెందిన లింగినేని కళ్యాణ్(68) సుమారు 20 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. గత ఐదారేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు వస్తున్నాయి. సుమారు రూ.10 లక్షలకు పైగా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో రెండేళ్ల క్రితం తనకున్న ఎకరన్నర పొలాన్ని అమ్మి వేసి కొన్ని బాకీలు తీర్చగలిగాడు. అయినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో మరోమారు ఐదు ఎకరాల కౌలు భూమిని తీసుకొని సాగు చేశాడు. అప్పటికే ఉన్న బాకీలకు తోడు రెండేళ్ల నుంచి ఖరీఫ్, రబీ సీజన్లో సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న పంటకు నష్టాలు రావడంతో మరింత అప్పులపాలయ్యాయి. సుమారు 20 లక్షల వరకు అప్పులు చేరాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కళ్యాణ్ మతదేహానికి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పూలమాల వేసి.. నివాళు లర్పించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

వైద్య విద్యార్థుల కొట్లాట

గంజాయి, కులాల గొడవ కాదు: డీఎస్పీ

8లో

అసైన్డ్ హక్కుదారులు స్వల్పమే.!

- మిగతా భూమి పలు కారణాలతో పక్కకు..
- 3.75 లక్షల ఎకరాలు పంచితే.. అర్హుల చేతిలో ఉంది 24,088 ఎకరాలే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలోనూ అసైన్డ్భూముల గుర్తింపు వ్యవహారం కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉంది. అసైన్డ్భూముల లబ్ధిదారులను గుర్తించి వారికి యజమాన్య హక్కులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటివరకూ జిల్లాల వారీగా పంపిణీ చేసిన భూములపై సర్వే చేపట్టారు. పంపిణీ చేసిన భూమి ఎవరిచేతిలో ఉంది? నిజమైన లబ్ధిదారులను తేల్చేందుకు కసరత్తు చేశారు. రెవెన్యూ శాఖ ఇందుకోసం రెండు నెలలుగా రికార్డులను చేతపట్టుకొని గ్రామాల్లో పరిశీలన చేశారు. ఎట్టకేలకు గణాంకాలను తేల్చారు. వాస్తవంగా అర్హులు చాలా తక్కువ మందే తేలారు.

జిల్లాలో ఇప్పటివరకూ 3,75,089 ఎకరాలు అసైన్డ్భూమి పంపిణీ జరగ్గా నిజమైన లబ్ధిదారుల చేతిలో కేవలం 24,088 ఎకరాలే ఉందని గుర్తించారు. ఇప్పుడు వీరికే రాష్ట్ర ప్రభుత్వం భూమిపై యజమాన్య హక్కు కల్పిస్తోంది. 2003 నాటికి ఈ అర్హులు తేలారు. మిగతా భూమి ఎక్కడున్నదనేదీ స్పష్టత లేదు. పలు కారణాలతో దాన్ని పక్కనబెట్టేశారు. వాస్తవానికి అసైన్డ్ భూములు ఎప్పుడో చేతులు మారాయి. పేదలకు ఇచ్చిన భూములను ఎక్కువశాతం మంది పదోపరకకో అమ్మేసుకున్నారు. ఆ భూములను సాగు చేయలేక.. పెట్టుబడులు పెట్టలేక సమీపంలో ఉన్న రైతులకు అమ్ముకున్నారు. కొన్ని రికార్డుల్లో మార్చుకున్నారు. కొన్ని మార్చలేదు. కొన్ని ప్రాంతాల్లో రికార్డులు కూడా అందుబాటులో లేవు. ఏదేమైనా పంపిణీ చేసిన భూమిలో చాలా తక్కువగానే నిజమైన లబ్ధిదారుల చేతుల్లో ఉంది. మిగతా 3.50 లక్షల ఎకరాలు ఎక్కడుందనేదీ తేల్చాల్సి ఉంది. ఇదంతా పెద్దల చేతుల్లో ఉందనే భావించక తప్పదు. కోస్తా మండలాల్లో అసైన్డ్భూముల పెద్ద ఎత్తున రొయ్యల కంపెనీల చెరలోకి వెళ్లాయి. వీటిని రాజకీయ నేతలు, పెద్దపెద్ద వ్యాపారులు సాగు చేస్తున్నారు. తీరప్రాంతాల్లో ఉన్న భూములను పేదలనుంచి కంపెనీలు, రాజకీయ నేతలు కొనేశారు. వెయ్యి రెండు వేలకే అప్పట్లో కొన్నారు. దీంతో రికార్డుల్లోనూ తారుమారు చేసి వారి బినామీలను ఎక్కించారు. ఏదోరకంగా భూములపై పేదలకు హక్కులు లేకుండా చేశారు. అమ్ముకున్నా పేదలకు ఏమీ దక్కలేదు. ఇప్పుడా భూముల్లో రొయ్యలు, ఉప్పు సాగు చేస్తున్నారు. రొయ్యల సాగు రూ.కోట్లలోనే ఉంటుంది. చీరాల మొదలు ఉలవపాడు వరకూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రొయ్యల చెరువుల్లో అసైన్ భూమి భారీగానే ఉంది. ఇక కొండలు సమీపంలో ఉన్న భూములను సమీపంలో పెద్ద పెద్ద రైతులు, రాజకీయ నేతలు కలుపుకున్నారు. ఎమ్మెల్యేలు కొందరు కొంత పట్టాభూమి కొనుగోలు చేసి సమీపంలో ఉన్న అసైన్ భూములను లాగేసుకున్నారు. పశ్చిమాన పలు నియోజవర్గాల్లో ఇదే జరిగింది. తాజాగా ఆన్లైను వచ్చాక అసైన్భూములను పాలకపక్ష నేతలు తమ బినామీల పేర్లతో ఎక్కించారు. ఇలాంటి అక్రమాలు చేసినందుకు ఇటీవల జిల్లాలో పెద్ద ఎత్తున తహశీల్దార్లు, విఆర్ఓలు సస్పన్షన్కు గురైన సంగతి తెలిసిందే. భూకబ్జాల్లోనూ ఈ భూములున్నాయి. రియల్ ఎస్టేట్ వచ్చాక ధరలు పెరిగాయి. వెంచర్లలో ఇవి కూడా చాలా చోట్ల కలిసిపోయాయి. నగరాలకు చుట్టుపక్కల ఉన్న అసైన్భూములను, పట్టా భూములను కలిపేసి ▶ 2లో

మున్సిపల్ కార్మికుల వంటావార్పు

- జగన్మోహన్రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్
- వర్షంలోనూ కొనసాగిన నిరసన

ఒంగోలు కలెక్టరేట్ వద్ద వంటావార్పుతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టి.. నిరసన తెలిపారు. ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసినా కూడా వర్షంలోనూ మున్సిపల్ కార్మికలు నిరసన కొనసాగించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చే విషయంలో మాట తప్పారని, మడమ తిప్పారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని నాటి ప్రజా సంకల్పయాత్రలో జగన్మోహన్రెడ్డి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క కార్మికుడినీ రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ జీవో నెంబర్ ఏడు ప్రకారం కోవిడ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, వారిని ఆప్కాస్లో చేర్చాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికులు, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు బదులు వారి కుటుంబసభ్యులకు పనిచేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమానికి యూనియన్ నగర కార్యదర్శి యు.రత్నకుమారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎస్డి హుస్సేన్, ఎస్ శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కె సామ్రాజ్యం, టి విజయ, రాగే రాములు, ఎం శ్రీలక్ష్మి, కె దివ్య, కె బాలకృష్ణ, కె మోహన్రావు, ఎద్దు రవికుమార్, సిహెచ్ అక్కేశ్వరరావు, కె వంశీ, కాశీ, కె చిన్న, యాకోబు పాల్గొన్నారు.

వర్షం కురవడంతో తలపై టవళ్లు వేసుకొని నిరసనలో పాల్గొన్న కార్మికులు

మాట్లాడుతున్న ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్

ఓటర్ల జాబితా రూపొందించడంలో

నిబద్ధతతో పనిచేయాలి

అధికారులకు ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడంలో అధికారులు సంతృప్తికరంగా నిబద్ధతతో పనిచేయాలని ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ డాక్టర్ పోల భాస్కర్ చెప్పారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీపై ఎన్నికల అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో తదుపరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోల భాస్కర్ మాట్లాడుతూ ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను చట్టబద్ధంగా నాణ్యతతో పరిష్కరిస్తే సమస్యలు, ఫిర్యాదులే ఉండవన్నారు. అధికారులు అత్యంత బాధ్యతతో పనిచేయాల్సి ఉందన్నారు. ఆ మేరకు ఎన్నికల కమిషన్ స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. బిఎల్ఓలకు క్షేత్రస్థాయిలో అవగాహన లేకపోవడం, ప్రజలను చైతన్య పరచకపోవడంతో దరఖాస్తులు, ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పది మంది ఓటర్లకు మించి ఒకే ఇంటి నెంబర్పై ఓట్లు ఉండరాదన్నారు. బాపట్ల జిల్లాలో అలాంటివి 773 ఓట్లు విచారణ చేయకుండా పెండింగ్లో ఉండటంపై ఆయన ఆరా తీశారు. ఓటర్ల జాబితా తయారీలో లోపాల సవరణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో విలువ ఉందన్నారు. ఓటు హక్కు ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఓట్ల తొలగింపు దరఖాస్తులు రెండో శాతానికి మించి వస్తే ఏఈఆర్ఓలు స్వయంగా క్షేత్ర స్థాయిలో విచారించాలన్నారు.

సవరణ ఓటర్ల జాబితా తయారీలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం కీలకమని రోల్ అబ్జర్వర్ భాస్కర్ తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఓటర్ల జాబితాలోని పొరపాట్లు, తప్పులు సవరిస్తున్నామన్నారు. ఓటర్ల జాబితా తయారీలో లింగ నిష్పత్తి ఖచ్చితత్వంగా ఉందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బిఎల్ఓలు, బి.ఎల్.ఏ.లు సమన్వయ కమిటీ సమావేశాలు విధిగా నిర్వహించాలన్నారు. ఎన్నికల ▶ 2లో

శిథిలావస్థకు చేరిన డివి పార్కు

ప్రజాశక్తి-పామూరు

పామూరు పట్టణంలోని కందుకూరు రోడ్‌లో ఉన్న డివి మనోహర్ పార్కు శిథిలావస్థకు చేరింది. మాజీ సర్పంచ్ డివి మనోహర్.. వారి తండ్రిగారైన దరిశి వీరాంజనేయులు పేరుతో డివి పార్కు ఏర్పాటు చేశారు. ఈ పార్కులోకి పట్టణ ప్రజలు అధికంగా వచ్చేవారు. పిల్లలు ఆటలాడుకునేందుకు మంచి సౌకర్యంగా ఉంది. దీనిని 2002లో ప్రారంభించి పంచాయతీకి అప్పజెప్పారు. అప్పటి నుంచి పంచాయతీ పాలకులు, అధికారులు అభివృద్ధిని మర్చిపోయారు. విద్యార్థులకు సెలవులు వస్తే పార్కులో ఆనందాన్ని గడిపేవారు. చిన్నపిల్లలను తీసుకొని తల్లులు పార్కు వచ్చి వారిని ఆడిపించుకొని వెళ్లేవారు. గతంలో మెడికల్ క్యాంపులు చిన్న చిన్న మీటింగులు ఎన్నో ప్రోగ్రాములు నిర్వహించుకున్న విషయం తెలిసిందే. ఈ పార్కు ప్రతి ఒక్కరికీ అన్ని విధాలుగా ఉపయోగపడుతోంది. అలాంటి పార్కు అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరింది. పార్కులు

శిథిలావస్థలో డివి పార్క్

ఉండటం వలన వృద్ధులు వచ్చి ప్రకృతిని ఆశ్రయిస్తూ సమయాన్ని గడిపేవారు. ప్రభుత్వ సెలవుల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు పార్కుకు వచ్చి వెళ్లేవారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు మరియు అధికారులు స్పందించి పార్క్ తిరిగి పూర్వ వైభవాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పామూరు పట్టణ ప్రజలు కోరుతున్నారు.



2002లో ప్రారంభించిన శిలాఫలకం

నిబద్ధతతో పనిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణకు ఓటర్ల జాబితా రూపొందించడం చాలా ముఖ్యమన్నారు. అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు వ్యక్తిగత సంతప్తితో పనిచేస్తే అనుకున్న లక్ష్యాలు చేరుకోగలమన్నారు. ఓటర్ల కోసం ప్రతిరోజు డిఆర్‌ఓ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి తుది ఓటర్ల జాబితా తయారీకి అధికారులు సమాయత్తం కావాలన్నారు. బిఎల్‌ఓలు అందరికీ గుర్తింపు కార్డులు తక్షణమే జారీ చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారందరికీ ఓటు లేకపోతే అధికారులే తమ విధి నిర్వహణ వైఫల్యంగా భావించాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో అర్హులైన విద్యార్థులందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ అత్యంత పారదర్శకతతో సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీకి యంత్రాంగం కషి చేస్తుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. 2011 జనగణన ఆధారంగా బాపట్ల జిల్లాలో 15 లక్షల 86 వేల 938 మంది ప్రజలు ఉన్నారని తెలిపారు. 6,09,312 మంది పురుష ఓటర్లు ఉండగా 6,40,482 మహిళా ఓటర్లు, ఇతరులు 88 మంది ఉన్నారన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం 12,51,489 మంది ఓటర్లు జిల్లాలో ఉన్నారని వివరించారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీ కొరకు నాలుగు లక్షల 42,357 గహాలను బిఎల్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించిన విషయాలను ఆయన ప్రస్తావించారు. 1,510 పోలింగ్ కేంద్రాలు ఉంటే ప్రతి కేంద్రానికి ఒక బిఎల్‌ఓ ను నియమించామన్నారు. ప్రతి మంగళవారం నియోజకవర్గ, మండల స్థాయిలో, ప్రతి బుధవారం జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి నెల నుంచి ఇప్పటివరకు 1,34,502 దరఖాస్తులు రాగా, 1,03,537 విచారణ పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయగా, 13,769 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉందన్నారు. మిగిలిన దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. జిల్లా జనాభాతో ఓటర్ల లింగ నిష్పత్తి 1,047గా ఉందన్నారు. ఓట్ల తొలగింపు కొరకు పదికి మించి 162 మంది ఎనిమిది వేల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు గుర్తించామన్నారు. మార్టూరు మండలంలో 59 మంది 3000 దరఖాస్తులు చేసినట్లు గుర్తించామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన నలుగురిపై కేసులు నమోదు చేశామని, సమగ్ర విచారణ జరుగుతుందన్నారు. ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని రాజకీయ పార్టీల నాయకులు కోరారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, డిఆర్‌ఓ పి వెంకటరమణ, ఆర్‌డిఓలు, ఈఆర్వోలు, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

అసైన్డ్ హక్కుదారులు స్వల్పమే..

(మొదటిపేజీ తరువాయి)

ప్లాట్లు వేసి అమ్మేశారు. అనేక చోట్ల ఈ తరహాలోనే నడిచాయి. ఇవన్నీ రాజకీయపార్టీల కనుసన్నల్లో జరిగినందున అందరూ కుట్రలో పాత్రదారులుగా ఉన్నారు. కనిగిరి, మార్కాపురం, దర్శి, వైపాలెం, నియోజకవర్గాల్లో ఎక్కువ భూములు రియల్ ఎస్టేట్‌లో కలిసిపోయాయి. ఇప్పటికీ అనేక ఫిర్యాదులు వచ్చాయి. పేర్లు మార్చడం, ఆన్‌లైనులో తప్పిదాలు, రికార్డులు సక్రమంగా లేకపోవడంతో పేదలకు అసైన్‌భూమి హక్కు లేకుండా పోయింది. ఏదేమైనా 80శాతం పైగా భూమి ఇపుడు నిజమైన లబ్ధిదారుల చేతిలో లేదని తేలింది. ఇది ఎవరి ఆధీనంలో ఉందో కూడా తేల్చాల్సిన అవసరం ఉంది.

మహా కుంభాభిషేకానికి విరాళం

ప్రజాశక్తి-పామూరు: పామూరులో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరగనున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మహాకుంభాభిషేక కార్యక్రమం నిమిత్తం డివిఅండ్‌పి విఎస్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పబ్బతి వెంకట నారాయణ దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. వారిని దేవస్థానం సభ్యులు బాలకొండలు, మస్తాన్‌రావు, మూర్తులు, గోపాల్ ఘనంగా సన్మానించారు.

ఫుట్‌బాల్ పోటీలకు సరస్వతి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు సరస్వతి హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, హెడ్‌మాస్టర్ శ్రీరామమూర్తి తెలిపారు. నవంబర్ 11,12వ తేదీల్లో తిరుపతిలో జరిగిన అండర్-16 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సరస్వతి హైస్కూల్ విద్యార్థులు తొమ్మితో తరగతి చదువుతున్న బారెడ్డి ప్రసాద్, బత్తుల శ్రీనాథ్, ఆకుల మనోహర్, అభిలాష్‌లు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఆ పాఠశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డితో పాటు హెచ్‌ఎం శ్రీరామమూర్తి, పీఈటీ వికాస్, ఉపాధ్యాయులు అభినందించారు. అదే విధంగా దర్శి మండలంలోని చందలూరు విద్యార్థులు 8 మంది జాతీయ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ అంజిరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు హిమజ, వై బ్లెసి, జయకుమార్, డేస్ డాగర్, జి శైలజ, నందిని, టి శాలిని ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎంతో పాటు విద్యార్థులు అభినందించారు.

కులగణన సర్వేను సరైన పద్ధతిలో చేయాలి

డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీనరసింహం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కులగణన ప్రక్రియను మండల పరిధిలో సరియైన పద్ధతిలో పూర్తి చేయాలని డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీనర సింహం అన్నారు. కుల గణన-2023 నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు విఆర్‌ఒలకు మండల కేంద్ర సచివాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహం మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జరిగే కులగణన కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సర్వే పూర్తి చేయాలని అన్నారు. సర్వే నిర్వహణపై వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహన పెంచుకొని గ్రామస్థాయి వాలంటీర్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. సచివాలయం ఉద్యోగులు వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకొని మొబైల్ లాగిన్‌లోనే నమోదు చేయాలని, కులగణన సర్వే పూర్తి అయ్యేంతవరకు మొబైల్ ఫోన్లు ఎవరూ మార్చవద్దని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఎంపీడీవో నుంచి సలహాలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి డిసెంబర్ 6వ తేదీ లోపల సర్వే పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సచివాలయం సిబ్బంది వీఆర్వోలు ప్రభుత్వ అందించిన ఏకరూప దుస్తులు, ఐడి కార్డులతో విధులు నిర్వహించకపోవడంతో సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో కె లలిత, పరిపాలన అధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహం

కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు సంపూర్ణంగా సహకరించాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం కనిగిరి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ అధికారి జాన్ ఇర్విన్‌కు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ కనిగిరి డివిజన్ పరిధిలో విద్యాశాఖకు సంబంధించిన డిప్యూటీ విద్యాశాఖ అధికారి కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయం, రోడ్ రవాణా శాఖ కార్యాలయం, డిప్యూటీ మెడికల్ కార్యాలయాలకు స్థల పరిశీలన చేసి భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే కనిగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నందున బైపాస్ రోడ్డు కోసం ప్రత్యేక చర్యలు తీసుకొని రోడ్డు పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని వినతిపత్రం అందజేయగా ఆర్డీవో జాన్ ఇర్విన్ సానుకూలంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వివిధ శాఖలకు సంబంధించిన కార్యాలయాలను ఉన్నత అధికారులతో చర్చించి స్థల పరిశీలన చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

కనిగిరి ఆర్‌డిఒకు వినతి ఇస్తున్న గఫార్

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కందుకూరు
H.M.O.P.No. 49/2021
బత్తుల రాజు – పిటీషనర్
Vs
బత్తుల వెంకట లలిత – రెస్పాండెంట్
To,
బత్తుల రాజు, తండ్రి **వెంకట కొండయ్య,**
మాచవరం గ్రామం, కనిగిరి మండలం,
ప్రకాశం జిల్లా.
పై నం. మీరు దాఖలు చేసిన విడాకుల పిటీషన్‌లో శ్రీ కోర్టు వారు ఎక్స్‌పార్టీ డిక్రీని రద్దు చేసి పై పిటీషన్‌ను విచారణ నిమిత్తం **తే20-12-2023ది కి** వాయిదా వేసివున్నారు. కాబట్టి వాయిదా రోజున అనగా **తే20-12-2023ది** న **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ వాదన తెలియచేసుకొనవలసింది. లేనిచో పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును. కాబట్టి తెలియపరచడమైనది.
వాయిదా తేది: **20-12-2023**
బి.వి. మురళీకృష్ణ
రెస్పాండెంట్ తరపు న్యాయవాది.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, మిర్యాలగూడ గారి కోర్టు యందు
H.M.O.P.NO. 52 OF 2023
మధ్యన:
వుయ్యూరు గోపికృష్ణ
.....వాది
మరియు
వుయ్యూరు విజయ లక్ష్మి
.... ప్రతివాది
టు,
వుయ్యూరు విజయ లక్ష్మి (తండ్రి పులి అచ్చయ్య) భర్త గోపికృష్ణ, వయస్సు: 28 సం.లు., వృత్తి: గృహిణి.నివాసం రాజవోలు గ్రామం, చెరుకుపల్లి మండలం, బాపట్ల జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
పైన తెలిపిన విడాకుల కోసం వేసిన కేసులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీకు రామీలు కావటం లేదు. కావున, ఈ పత్రిక ముఖంగా తెలియజేయునది ఏమనగా, ఈ ప్రకటనను నోటీసు గా భావించి మీరు గాని, మీ తరపున మీ వకిల్ గారు గానీ తేది. 05-12-2023 నాడు ఉదయం 10-30 గంటలకు పైన తెలిపిన కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలపగలరు. లేని పక్షం లో మీ పరోక్షం లో సదరు విడాకుల కోసం వేసిన కేసు మీ పరోక్షంలో కోర్టు వారిచే తీర్మానించబడును.
(కోర్టు వారి అనుమతితో)
ఇట్లు
మేక కుమార్ రెడ్డి
(TS/643/2007) M.A., LL.B..
ADVOCATE
H.No.28-1074/1,
Housing Board Colony,
MIRYALAGUDA,
Nalgonda District.
Cell: 9030928050, 9849188050
స్థలం: మిర్యాలగూడ
తేది: 21-11-2023.

ప్రజాశక్తి 3
బుధవారం 22 నవంబర్ 2023

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు

ఒంగోలు ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సముద్ర తీరాన్ని రాష్ట్రానికి సంపదకేంద్రంగా మారుస్తూ మత్స్యకారుల జీవితాలలో వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 'ప్రపంచ మత్స్య దినోత్సవం' సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు, జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాదిగ కార్పొరేషన్ చైర్మర్ కొమ్మూరి కనకారావుతో కలిసి ఒంగోలు ఎంపీ హాజరయ్యారు. అనంతరం ఇద్దరు మత్స్యకారులకు ఒక్కొక్కటి రూ.20 లక్షల విలువైన (40 శాతం సబ్సిడీపై) ఇన్సులేటెడ్ వాహనాల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాగుంట నూట్లాడుతూ 970 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం రాష్ట్రానికి వరమన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను ఏర్పాటు చేయడం ద్వారా తీరప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతోపాటు వారి సంక్షేమానికి పలు పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. మత్స్యకార భవన నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం చేస్తానని ఎంపీ ప్రకటించారు. జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బతుకుదెరువు కోసం ప్రకతి వనరులపై ఆధారపడుతున్న మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం పారదర్శకంగా పలు పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ పొట్ట చేతపట్టుకుని ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలోకి వేటకు వెళుతున్న మత్స్యకారుల జీవితాలలో ముఖ్యమంత్రి గణనీయమైన మార్పు తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వివిధ వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి ధైర్యంగా అమలు చేస్తున్నారన్నారు. సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ మత్స్యకారుల పడవలకు లీటరుకు రూ.9 సబ్సిడీతో డీజిల్, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10 లక్షల బీమా, కెసిసి కార్డుల ద్వారా రుణాలు, ఆక్వా రైతులకు సబ్సిడీ విద్యుత్ లాంటి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరూ వీటిని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో 2019-20 నుంచి 2023-24 వరకు ఈ పథకాల ద్వారా రూ.397 కోట్ల ఆర్థిక ప్రయోజనం కల్పించినట్లు వివరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ కొత్తపట్నంలో రూ.392 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేయటంతో పాటు మత్స్యకారులకు అందుబాటులో ఉండేలా సచివాలయాల స్థాయిలో ఫిషరీస్ అసిస్టెంట్లను నియమించినట్లు తెలిపారు. 50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు పెన్షను, సంక్షేమ, అభివద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా అనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్ సుమతి, మత్స్యకార సంఘం నాయకులు వాయల మోహన్ రావు, ఆప్కాబ్ న్యాయ సలహాదారు సైదా, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఉషాకిరణ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్కీం వర్కర్స్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు నగర ఆఫీస్ బేరర్స్ సమావేశం నగర అధ్యక్షుడు సిహెచ్. రాంబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు సక్రమంగా రాక, అతి తక్కువ వేతనాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజనం. కేంద్ర ప్రభుత్వం స్కీంలలో పనిచేస్తున్న వారందరికీ ప్రతి నెలలో వేతనాలు ఇవ్వాలన్నారు. స్కీమ్‌లలో పనిచేస్తున్న అందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. లేదా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర ఉపాధ్యక్షుడు జి.రమేష్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దశలవారీగా రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు ఏళ్ళు పూర్తవుతున్నా ఒక్క కార్మికుడిని రెగ్యులర్ చేయకపోవటం దారుణమన్నారు. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులర్ చేసేందుకు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్, నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, ఎస్‌డి.హుస్సేన్, సహాయ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జె.ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

కూలిన కల్వర్టు .. తప్పిన ప్రమాదం..

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారిపాలెం గ్రామంలో పొలాలకు వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టు మంగళవారం హఠాత్తుగా కూలి పోయింది. అదే సమయంలో కల్వర్టుపై ప్రయాణిస్తున్న ట్యాంకర్ బోల్తా పడింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పొలానికి ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకువెళ్తున్నాడు. ట్యాంకర్ పోలేరమ్మ గుడి వద్ద ఉన్న చప్టాపైవెళ్లింది. అదే సమయంలో చప్టా కుంగిపోయింది. దీంతో టాక్టర్ బోల్తా కొట్టింది. సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కల్వర్టు పొలాలకు వెళ్లేందుకు అనువుగా ఉంది. ఈ చప్టాపై నిత్యం పెద్దసంఖ్యలో ట్రాక్టర్లు, వ్యవసాయ కూలీలు ఆటోలు, ఇతర వాహనాలు, బైకులపై రాకపోకలు సాగిస్తుంటారు.

కూలిన కల్వర్టు

విద్యార్థినుల పట్ల అసభ్యకర ప్రవర్తన

ప్రధానోపాధ్యాయుడికి కాలనీవాసుల దేహశుద్ధి

ప్రజాశక్తి-మద్దిపాడు

పలువురు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడికి కాలనీవాసులు దేహశుద్ధి చేసిన ఘటన మండల పరిధిలోని పెదకొత్తపల్లి అంజయ్య నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో మంగళ వారం చోటుచేసుకుంది. ఒంగోలు,క్లొపేటకు చెందిన సుందర్‌బాబు పెదకొత్తపల్లిలోని అంజయ్యనగర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. సుందర్‌బాబు తమపట్ల అసభ్యకరంగా ప్రవరిస్తున్నాడని బాధిత విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు, కాలనీవాసులు మంగళవారం పాఠశాల వద్దకు వచ్చి.. హెచ్‌ఎంకు దేహశుద్ధి చేశారు. అనంతరం అతడిని పాఠశాలలోనే ఉంచి.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శ్రీకాంత్ ప్రధానో పాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని.. స్టేషన్‌కు తరలిస్తుండగా కాలనీ వాసులు పోలీసు వాహనాన్ని అడ్డుకొని.. నిందితుడిపై కఠినచర్యలు తీసు కోవాలని నినా దాలు చేశారు. చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హామీ ఇచ్చారు. పోలీసులు నిందితుడిని స్టేషన్‌కు తరలించి.. కేసు నమోదు చేశారు. మరో నాలుగైదు నెలల్లో ఈ ప్రధానోపాధ్యాయుడు ఉద్యోగ విరమణ చేయనున్నట్లు సమాచారం.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన యర్రగొండ పాలెంలోని ఎన్‌జిఒ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గిద్దలూరుకు చెందిన కోటా కృష్ణారావు (62) అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. అతని కుమారుడు యర్రగొండపాలెం మండలంలోని చెన్నరాయునిపల్లి గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. దీపావళి పండుగ సందర్భంగా కృష్ణారావు కుమారుడి వద్దకు వచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడే ఉన్నారు. అనారోగ్య సమస్యలతో తీవ్ర మనస్తాపం చెందిన కృష్ణారావు స్థానిక సాయిబాబా మందిరం వద్ద గోడకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు ప్పాలడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-వేటపాలెం

కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. ఈ ఘటన చీరాల-వేటపాలెం బైపాస్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కారు అదుపు తప్పి నడుకుంటూ వెళ్తున్న ఓ యువడికి ఢీకొంది. అనంతరం రోడ్డు ప్రక్కనే ఉన్న ఓ దుకాణంలోకి దూసుకెళ్ళింది. ఆ సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కారు ఢీకొనడతో గుత్తి వెంకట సాయి అనే యువకుడి తీవ్ర గాయాల్యాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కష్ణమోహన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.క్షతగాత్రుడికి వైద్యశాలకు తరలించేందుకు కృషి చేశారు. వేటపాలెం ఎస్‌ఐ సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల పరిధిలోని సురేపల్లి గ్రామానికి చెందిన బుర్రా చినరత్తయ్య (62) అనే వ్యక్తి రెండు రోజుల క్రితం పేటేరు గ్రామ సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. ఆయన్ని వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మతి చెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వైద్యశాలకు వెళ్లి మతిడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మతుడు చిన్న రత్తయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చాడు. మాజీ మంత్రి ఆనందబాబు వెంట టిడిపి మండల కన్వీనర్ వాకా శేషుబాబు,టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామంలో వరి రైతులకు ప్లాంట్‌క్లినిక్ పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల ఏరువాక కేంద్రం శాస్రవేత్త, డాట్ కోఆర్డినేటర్ ఓబయ్య, జి.సురేఖ వాణి మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుచేసిన వరికి బెట్ట పరిస్థితుల్లో ఉల్లికోడు ,అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. తెగుళ్ల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు, లేదా నేటివో 0.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ కమతం యాకోబు, విలేజ్ అసిస్టెంట్ దివ్య ,రైతులు పాల్గొన్నారు.

కరణం వెంకటేష్‌తో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వెంకటేష్‌బాబుకు పరామర్శ

ప్రజాశక్తి - వేటపాలెం

వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబును మండలంలోని వైసిపి ద్వితీయ శ్రేణి నాయకులు హైదరాబాద్ వెళ్లి పరామర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. వైసిపి అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, ఖాదర్, సాలేహ, వెంకటేశ్వర్లు, కేవీ, కిషోర్, జోషి, పల్లపాలు శ్రీనివాసరావు, సాదు రాఘవరావు, ఆవుల అశోక్ కుమార్, భరత్ కుమార్ ఉన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా పేర్లి బుజ్జిరాజు నియామకం

యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా పేర్లి

ప్రజాశక్తి - చీరాల

యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పేరాల శృంగారపేటకు చెందిన పేర్లి బుజ్జిరాజును నియమిస్తున్నట్లు కాంగ్రెస్ ఇంచార్జి దేవరపల్లి రంగారావు తెలిపారు. స్థానిక డ్రైనేజీ గెస్ట్ హౌస్‌లో నియామక పత్రం మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా దేవరపల్లి రంగారావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తెచ్చిన కాంగ్రెస్ అనేక రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేసిందని అన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన కాంగ్రెస్‌లో పదవి ఇచ్చినందుకు బుజ్జిరాజు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బలోపేతం చేసేందుకు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో పీటర్ రమేష్, విజయ్ కుమార్, దేవరపల్లి అరవింద్, మర్రి శ్రీనివాసరావు, సుభాని పాల్గొన్నారు.

ఆర్‌బికె ఛైర్మన్ రమణారెడ్డిని పరామర్శిస్తున్న బలరాం

కావూరిని పరామర్శించిన బలరాం

ప్రజాశక్తి - చీరాల

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆర్బికె ఛైర్మన్ కావూరి రమణారెడ్డిని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మంగళవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రమణారెడ్డికి అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రమణారెడ్డి త్వరగా కోలుకునే విధంగా వైద్యసేవలు అందించాలని చెప్పారు. అధైర్యపడవద్దని, తాను అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నేడు ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి - నిజాంపట్నం

హజరత్ సయ్యద్ జైనుల్లాబ్దిన్ బాబావలియా 73వ ఉరుసు మహోత్సవం ఈ నెల 22న బుధవారం జరుగుతుందని దర్గా కమిటీ ప్రెసిడెంట్ పి నాజర్ ఖాన్ తెలిపారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా గంధం ఇచ్చే వార్ల గృహముల నుండి బ్యాండ్ మేళాలు, ఫకీర్లతో బాబావారి గంధం అత్యంత వైభవంగా బయలుదేరి గురువారం తెల్లవారు జామున 3గంటలకు బాబావారి సన్నిధికి చేరుతుందని మంగళవారం తెలిపారు. అలాగే దర్గా వద్ద బుధవారం రాత్రి 7 గంటల నుంచి ఉదయం 4గంటల వరకు ఖవాలీ పాటల కచేరి జరుగుతుందని తెలిపారు. దర్గాకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. కావున భక్తులు అందరు ఉరుసు మహోత్సవానికి హాజరై బాబావారి కృపకు పాత్రులు అవ్వాలని కోరారు.

రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ కార్యకర్తల విస్తృత సమావేశం గంగవరంలోని మంచాల రంగమ్మ, వెంకటరామయ్య కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలేటి కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలు పరిష్కారం కావాలంటే పార్టీలకతీతంగా రైతులంతా ఐక్యమై పటిష్టమైన పోరాటం చేయటమే మార్గమని అన్నారు. రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 27, 28తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగే ధర్నాలో రైతులు వేలాదిగా హాజరై పాలకవర్గాలను హెచ్చరించాలని కోరారు. ఢిల్లీ రైతు ఉద్యమస్ఫూర్తితో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపును రైతులంతా జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పంటలన్నింటికీ సమగ్ర ఉత్పత్తి వ్యయ్యానికి 50శాతం పెంచి గిట్టుబాటు ధరలు

సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య

నిర్ణయించి చట్టబద్ధం చేయాలని కోరారు. ధర తగ్గినప్పుడు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. రైతుల పాలిట ఉరితాడుగా ఉన్న నూతన విద్యుత్ బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని అన్నారు. రైతులు, కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని కోరారు. వడ్డీలను రద్దు చేయాలని అన్నారు. కార్పోరేట్ అనుకూల ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని రద్దుచేసి సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. వాతావరణ బీమా అమలు చేయాలని కోరారు. వ్యవసాయ ఉపకరణాలు, నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించాలన్నారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ పై ఎక్సైజ్ డ్యూటీని తగ్గించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని కోరారు. కృష్ణా జలాల పునః పంపిణీ ఆలోచనను కేంద్రం వెనక్కి తీసుకోవాలని కోరారు. రీ సర్వేలో జరుగుతున్న పొరపాట్లను సరిచేసి ప్రతి రైతుకు అతని భూమి వివరాలను పాసుపుస్తకంలో స్పష్టంగా పేర్కొనాలని కోరారు. పాస్‌పుస్తకాలపై సిఎం ఫోటోలను తీసివేయాలని అన్నారు. విజయవాడ ధర్నాను జయప్రదం చేసేందుకు విస్తృత ప్రచారం చేసి రైతులను కదిలించాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కందిమళ్ళ రామకోటేశ్వరావు, రాయిని వినోద్, బాచిన కోటేశ్వరావు, ఎర్రం గోవిందరెడ్డి, పాలెపు సాంబయ్య, రామాంజనేయులు, మాదాల అంజయ్య, నాగబోయిన సింగారావు, నాగేశ్వరరావు, ఆదియ, బండి సాంబయ్య, శేషాద్రి, మోహన్ రావు, హరిబాబు, సుబ్బారావు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

సిడిపిఒకు సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - బాపట్ల

అంగన్వాడి వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8నుండి సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు అంగన్వాడి కమిటీ కోశాధికారి సీతా మహాలక్ష్మి తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం సిడిపిఓ శైలజకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతా మహాలక్ష్మి, కమిటీ గౌరవ అధ్యక్షులు జె సామ్యూల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ సమస్యలపై సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. రోజువారి పని ఒత్తిడి పెరగటం, యాప్స్ పేరుతో అంగన్వాడిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. నిత్యవసర ధరలు భారీగా పెరిగినా వేతనాలు పెంపుపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి వేతనం ఇస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఆచరణలో ఇప్పటికీ సిఎం హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. సంక్షేమ పథకాల అమలు చేయకపోవడం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం, లబ్ధిదారులకు అవసరమైన నాణ్యమైన సరుకులు సరఫరా చేయకపోవడం వంటి సమస్యల కోకొల్లలుగి ఉన్నాయని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు శరత్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఒక సెంటర్లో వర్కర్ రిటైరైనా, పదోన్నతిపై వెళ్లిన ఆ సెంటర్లో ఉన్న హెల్పర్ 10వ తరగతి పాసై ఉంటే ఆ హెల్పర్‌కి వర్కర్‌గా ప్రమోషన్ ఇవ్వలనే నిబంధన ఉందని అన్నారు. ఈ అంశంపై అంగన్వాడీల పట్ల అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని అన్నారు. ఏడాదికాలంగా అర్హతలు ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఆయాలకు ప్రమోషన్ ఇవ్వక పోవడంతో హెల్పర్, వర్కర్ పనిని ఒకే వ్యక్తి చేయడం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. అర్హులైన ఆయాలకు తక్షణమే వర్కర్స్ గా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసు అందజేసిన వారిలో హైమావతి, నిర్మల, అశ్విని, రాజకుమారి, హేమ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

నిజాంపట్నం : అంగన్వాడి వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్లపట్ల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై మేరీమణి, పల్లపట్ల ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్స్ సమస్యలు పరిష్కారం కోసం డిసంబర్ 8 నుంచి సమ్మె చేస్తున్నట్లు మంగళవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ అనసూయకు సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజువారి పని ఒత్తిడి పెరగటం, యాప్స్ పేరుతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రోజువారీ ధరలు పెరుగుతున్నా వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యహిస్తున్నారని అన్నారు. తెలంగాణా కన్నా ఎక్కువ వేతనం ఇస్తామన్న హామీ అమలు చేయాలని కోరారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. కేంద్రాలకు నాణ్యమైన ఫుడ్ సరఫరా చేయాలని కోరారు. వైసిపి అధికారానికి వచ్చిన తర్వాత వివిధ రూపాల్లో తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో సమ్మెకు వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ (సిఐటియు) పల్లపట్ల ప్రాజెక్ట్ నాయకురాలు బేబీరాణి, ఉషా పాల్గొన్నారు.

సమ్మెనోటీసు అందజేస్తున్న అంగన్వాడీలు, మణిలాల్

సముద్ర స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్న పూర్ణకుమారి

సముద్ర స్నానాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - వేటపాలెం

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆదేశాల మేరకు సముద్రతీరంలో ప్రజలు కార్తీక కామ పుణ్య స్నానం ఆచరించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని రామాపురం, పొట్టి సుబ్బయ్య పాలెం తీరంలో సముద్ర స్థానాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. మరుగుదొడ్లు, మహిళలు, పురుషులు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించారు. త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఆర్డబ్ల్యూఎస్ డిఇ ఎస్ సతీష్ చంద్ర, ఎంపీడీఒ కె నేతాజీ సముద్ర తీరప్రాంతాల్లో పర్యటించారు. అక్కాయపాలెం పంచాయతీ కార్యదర్శి పూర్ణకుమారి రామాపురం, ఓడరేవు నందు దగ్గరుండి పనులను పురమాయించారు. రాత్రి వేళల్లో విద్యుత్ అంతరాయం లేకుండా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు.

ఖోఖో రాష్ట్ర ప్రధమ స్థానంలో నిలిచిన ప్రకాశం జట్టు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు

తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం కొప్పోలు రమాదేవి మంగళవారం తెలిపారు. ఎస్‌జిఎఫ్ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన అండర్-17 ఖోఖో పోటీలలో తమ పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా తరపున తమ విద్యార్థులు పాల్గొన్న జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరిలో చెన్నూరు బాజీ బాబు, నక్క భరత్ కుమార్, ఇందూరి ప్రవీణ్‌రెడ్డి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల పిడి మేకల సీతారాంరెడ్డి, పోటీలో గెలుపొందిన విద్యార్థులను హెచ్ఎం రమాదేవి తోపాటు ఎంఇఒ కె నాగభూషణం, జి వీరాంజనేయులు, పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థి సంఘం, గ్రామస్తులు అభినందించారు. తమ పాఠశాలకు అవకాశాన్ని ఇచ్చిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి కె వనిజకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కార్తీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథలకు అన్నదానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

వేమూరు మండలం చావలి గ్రామంలోని ఎస్టీ కాలనీ సుమారు 50మందిపైగా అనాథ పిల్లలు, వృద్ధులకు అద్దేపల్లి గ్రామానికి చెందిన దాసరి కిరణ్, మనోజ కుమారుడు రోషన్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా కార్తీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు నండూరి కార్తీక్ మాట్లాడుతూ రోషన్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా తల్లిదండ్రులు సేవా దృక్పథంతో అనాథ పిల్లలు, వృద్ధులకు అన్నదానం చేయటం అభినంద నీయమని అన్నారు. రోషన్ పుట్టినరోజు వేడుకల కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. దాసరి కిరణ్ సేవా దృక్పథాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో కార్తీక్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జన్మదిన కేక్ కట్ చేస్తున్న రోషన్

ప్రజాశక్తి
5
బుధవారం 22 నవంబర్ 2023

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సంక్షేమ లబ్ధి పట్టిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి.?' అనే కార్యక్రమం మంగళవారం మూలగుంటపాడు సచివాలయం-2లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు సంక్షేమ అభివద్ధి లబ్ధి పట్టిక (బోర్డ్)ను ఆవిష్కరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ బ్రోచర్‌ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ శింగరాయకొండ మండల అధ్యక్షులు మరియు వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎంపిటిసి దార్ల విజయకుమారి, కోటేశ్వరరావు, సచివాలయం కన్వీనర్‌లు గుండపు విజయభాస్కర్‌రెడ్డి, నాయుడు, లక్ష్మణ్‌కుమార్, రాయి క్రాంతికుమార్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లావుద్దీన్, దార్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కోనేటిని పరిశీలిస్తున్న డీఎస్పీ

24న తెప్పోత్సవం

పజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి పుష్కరిణిలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా తెప్పోత్సవ ఉభయదాత, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తెప్పోత్సవానికి వేలాదిగా జనం తరలిరానున్నారు. తెప్పోత్సవ కోసం మార్కాపురం చెరువులోని నీటిని పుష్కరిణిలోకి మోటార్ల సాయంతో పంపింగ్ చేస్తున్నారు. తెప్పోత్సవ ఏర్పాట్లను శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు, డాక్టర్ కనకదుర్గ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తెప్పోత్సవానికి తరలివచ్చే జనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించేదుకు ఈ ప్రాంతాన్ని మార్కాపురం డిఎస్‌పి జి.వీరరాఘవరెడ్డి, సిఐ ఎం.భీమానాయక్, మార్కాపురం పట్టణ ఎస్ఐ పి.కోటేశ్వరరావులు పరిశీలించారు.

బ్రోచర్లు పంపిణీ చేస్తున్న వైసిపి నేతలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-చీరాల

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని పార్టీ పట్టణ అధ్యక్షులు కోంద్రు బాబ్జి అన్నారు. పట్టణంలోని స్థానిక 25వ వార్డ్ సచివాలయ పరిధిలో వార్డ్ ఇన్‌ఛార్జ్ కోడూరి ప్రసాదరెడ్డి అధ్యక్షతన మంగళవారం ఎపికు జగనన్నే మరలా ఎందుకు కావాలి? అనే కార్యక్రమం జరిగింది. రెండోరోజు కార్యక్రమంలో భాగంగా గడప గడపకు వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి బ్రోచర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కోంద్రు బాబ్జీ, జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, జేసియస్ మండల కన్వీనర్ కోలా శివకృష్ణ,22 వ వార్డ్ ఇంచార్జ్ షేక్ సుభాని, 26వ వార్డ్ ఇంచార్జ్ అన్నం సతీష్, సీనియర్ నాయకుడు తలకాయల సుధీర్, యువ నాయకుడు డొక్కా ప్రవీణ్, యువ నాయకుడు డొక్కా రాంప్రసాద్, యువ నాయకుడు కర్రా సతీష్, యువ నాయకుడు బట్టు పోతురాజు, సీనియర్ నాయకులు తేళ్ళ రాంబాబు,పులి శ్రీనివాస రావు, జల్లివాసు, కె. వాసు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-కొండపి

నవంబర్ 27, 28 తేదీల్లో కార్మిక, రైతు మహా ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ఉద్యోగ వర్గానికి, కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం కొండపి మండలంలోని ఉద్యోగుల, కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొండపి సిఐటియు అధ్యక్షులు గడ్డం వందనం, సంగం నాయకులు ఎం.గంగాధర శేషమ్మ, అధిరాభి, ఆశా నాయకులు విజయమ్మ, రవణమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

గోళ్లవిడిపిలో 'జగనే ఎందుకు కావాలి?'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గోళ్లవిడిపి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ మాట్లాడారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇఒంటింటికి తిరిగి గడపగడపకు మన కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో జడ్పిటిపసి చేదూరి విజయభాస్కర్, వైసీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ జబివుల్లా, నాయకులు రాములు నాయక్ పాల్గొన్నారు.

వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పుల్లలచెరువు: మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో సచివాలయ పరిధిలో నాయుడుపాలెం సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పుల్లలచెరువు మండల కన్వీనర్ బోగోలు వెంకట సుబ్బారెడ్డి, ఎంపీపీ కందుల వెంకటయ్య, మండల ఉపాధ్యక్షుడు లింగంగుంట్ల రాములు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ అలవాల గాలిరెడ్డి, సచివాలయ కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు, ముద్ద వాసు, చాపలమడుగు సర్పంచ్ సత్యనారాయణ, నాయుడుపాలెం సచివాలయ కన్వీనర్ సిద్ధల నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువు కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం జర్నలిస్ట్ అసోసియేషన్, వాసవీ విజన్ క్లబ్ సంయుక్తంగా నిరుపేద క్రీడాకారిణి ఒంటేరు వాణికి ఆర్థిక చేయూతను అందించింది. మార్కాపురం మండలం నాయుడుపల్లి గ్రామానికి చెందిన ఒంటేరు వాణి అథ్లెటిక్స్‌లో జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. అనేక మెడల్స్ సాధించి ప్రముఖుల మన్ననలు పొందింది. ఒంటేరు వాణి ఉన్నత చదువులకు పేదరికం అడ్డుగా నిలిచింది. ఆర్థిక ఇబ్బందులను గమనించి వాసవి విజన్ క్లబ్ టీం రూ.4000, మారుగొండ్ల ఆదినారాయణ (రిపోర్టర్) రూ. 1000, కటకం రాము రూ.1000 కలిపి రూ. 6000 ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందించారు. క్రీడల్లో, చదువులో రాణిస్తున్న ఒంటేరు వాణికి ఆర్థిక సాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలి. ఆర్థిక సహాయం అందించాలనే వారెవరైనా ఫోన్ పే నెంబర్ 9182239815 సాయం అందించాలని పలువురు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వాసవి విజన్ సభ్యులు గంగిశెట్టి కిరణ్‌కుమార్, పోలేపల్లి వెంకటలక్ష్మినారాయణ, వెలుగూరి వెంకటేశ్వర్లు, గుర్రం రామారావు, పెసల సుబ్రమణ్యం, రిపోర్టర్ ఎం.ఆదినారాయణ, కోచ్ చిట్టిబాబు, హెూం గార్డు చెన్నుపల్లి కాశయ్య పాల్గొన్నారు.

పేద క్రీడాకారిణికి సాయం అందిస్తున్న దృశ్యం

తెలుగుదేశంతోనే మహిళా సాధికారత

కొండపి శాసనసభ్యులు స్వామి

ప్రజాశక్తి-కొండపి

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యమని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. మంగళవారం మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు బి.యలమంద నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల్ని ఆర్థికంగా పరిపుష్టి చేయడం జరిగిందన్నారు. ఆడ బిడ్డ వంటింటి కష్టాలను చూసి గత తెదేపా ప్రభుత్వంలో దీపం పథకం క్రింద ప్రతి ఇంటికి గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరిగింద న్నారు. రాబోయే తెదేపా ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ దీపం పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఏయంపి ఛైర్మన్ జి.రామయ్య చౌదరి, బత్తుల నారాయణ స్వామి, నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, వసంత, దామా మురళి, గుండపనేని రామూర్తినాయుడు, వెంకటరావు, ఎన్. సుబ్బరామయ్య, బి.సోమయ్య, బి.ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న కొండపి ఎమ్మెల్యే స్వామి

పథకాల అమలు జగన్‌తోనే సాధ్యం

సర్పంచ్ ఝాన్సీరాణి

ప్రజాశక్తి-టంగుటూరు

సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమని సర్పంచ్ బిళ్ళా ఝాన్సీ రాణి అన్నారు. మంగళవారం మండలంలోని ఆలకూరపాడు గ్రామంలో "వై ఏపీ నీడ్స్ జగన్" కార్యక్రమం గ్రామ సర్పంచ్ బిళ్ళా ఝాన్సీ రాణి అధ్యక్షతన జరిగింది. అనంతరం సంక్షేమ పథకాల పట్టికను సర్పంచ్ ఝాన్సీరాణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ సభ్యులు బుర్ల అనూష, పంచాయితీ కార్యదర్శి పి సాంబయ్య, గ్రామ విఆర్‌ఓ చింతపల్లి కష్ణవేణి, మాజీ ఎంపీటీసీ బ్రాహ్మణకాక వేణు, వైసీపీ నాయకులు సురేంద్రరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, ఆశా, అంగన్వాడి కార్యకర్తలు, వాలంటీర్లు, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-కొండపి

వాలంటీర్లకు, సచివాలయం సిబ్బందికి కులగణన సర్వేపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మండల అబివృద్ధి కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు పి.సింగరావు, యంపిడివో రమణమూర్తి మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి ఇంటింటికీ వెళ్లి కులగణన సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానిస్తున్న ఎంపిజె నాయకులు

ఎస్ఐ రాజేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మూవెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ యర్రగొండపాలెం శాఖ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం నూతన ఎస్సైగా ఎం వెంకట రాజేష్‌ని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీజే ఫౌండర్ మెంబర్ పఠాన్ ఖాసిం ఖాన్, యర్రగొండపాలెం పట్టణ అధ్యక్షులు సయ్యద్ ఇస్మాయిల్, వైస్ ప్రెసిడెంట్ షేక్ షేక్షా వలి, ప్రధాన కార్యదర్శి తోట రామకష్ణ, కోశాధికారి మొహిద్దీన్, సభ్యులు రహిమాన్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిగా దేవేందర్‌రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జిగా బి.దేవేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గిద్దలూరు కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న దేవేందర్‌రెడ్డి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది మార్కాపురం బదిలీపై వస్తున్నారు.

దేవేందర్‌రెడ్డి

నోటీసు అందజేస్తున్న నేతలు

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-కొండపి

డిసెంబర్ 8 నుండి సమ్మె చేస్తున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సిఐటియు నాయకులు గంటెనపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యం లో సిడిపివో కార్యాలయంలో సిబ్బం దికి మంగళవారం సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాకర్ల గుంటూరు మస్తాన్, గడ్డం వందనం, అంగన్వాడీ నాయకులు ధనలక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తున్న ఎఒ ఐ కాశీవిశ్వనాద్

దేశాయిపేటలో 'పొలం బడి'

ప్రజాశక్తి - వేటపాలెం

దేశాయిపేట3వ రైతు భరోసా కేంద్రంలో పోలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వరిలో డిటిల్ల రింగ్ వలన ప్రయోజనాలను వ్యవసాయాధికారి ఐ కాశీవిశ్వనాద్ రైతులకు వివరించారు. పురుగు నియంత్రణచర్యలు వివరించారు. పంట సాగులోగల మెళుకువలు, సూచనలు తెలిపారు. రైతుల సందేహాలకు సమాధానం చెప్పారు. వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే పథకాలను రైతులు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ మనీషా, కావ్య, జ్యోతి, సునీల్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో కలుపు మందు పిచికారీ చేస్తున్న రైతు

కలుపు మందులు పిచికారీ

ప్రజాశక్తి - ఇంకొల్లు

గత ఏడాది సెనగ సాగు చేసిన రైతులు కలుపు బెడదను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది కలుపు నివారణ మందులు పిచికారి చేస్తున్నారు. విత్తనాలు వెదజల్లిన వెంటనే భూమిపై ఈ మందులు ట్రాక్టర్‌తో పిచికారి చేస్తున్నారు. ఈ పిచికారి వల్ల కలుపు నివారణ చేయవచ్చన్న ధీమాతో రైతాంగం ఉన్నారు. గత ఏడాది ఎకరాకు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు కలుపు కూలలకు ఖర్చు అయ్యిందని రైతులు చెబుతున్నారు. దీంతో ముందు జాగ్రత్తగా కలుపు నివారణ మందులు పిచికారి చేస్తున్నారు. ఎకరాకు పిచ్చుకారికి కంపెనీని బట్టి రూ.600నుంచి రూ.700మందులు, పిచికారి చేసినందుకు ట్రాక్టర్‌కు రూ.300 ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. రూ.వెయ్యి లోకే కలుపు నివారణ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సజ్జా

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి వేటపాలెం

రాష్ట్ర ప్రభుత్వం అరాచకాలకు చమర గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని టిడిపి నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు అన్నారు. చంద్రబాబుకు సాధారణ బెయిల్ మంజూరైన సందర్భంగా ఆనుమల్లిపేట చిన్న బజార్ సెంటర్లో చంద్రబాబు చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. చంద్రబాబును అక్రమంగా జైల్లో ఉంచి చిన్న ఆధారం కూడా చూపలేకపోవడం వైసీపీ కుట్రలు బయట పెట్టుకుం దని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బుద్ధి రమేష్, షేక్ రఫీ, పింజెల భాస్కరరావు, కరిముల్లా, సజ్జా రవికుమార్, మెట్ల వెంకట సుబ్బారావు, గంజి గాంధీ, బొడ్డు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - నగరం

ఎంఆర్ఒ ఎం ప్రమీల

స్థానిక శ్రీవెలగపూడి రామకృష్ణ కళాశాలలోని ఆడిటోరియంలో నేడు జగనన్నకు చెబుదాం స్పందన నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు ఎం ప్రమీల తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ రంజిత్ బాష, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు వివరించాలని కోరారు.

బిఎల్‌ఒలు బాధ్యతగా పనిచేయాలి

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ డాక్టర్ పోలా భాస్కర్

ప్రజశక్తి - చీరాల

బిఎల్‌ఒలు క్షేత్రస్థాయిలో సక్రమంగా పనిచేస్తే ఓటర్ల జాబితా పక్కాగా ఉంటుందని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ డాక్టర్ పోల భాస్కర్ చెప్పారు. జిల్లాకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌గా నియమితులైన ఆయన మంగళవారం తొలి సారిగా జిల్లాలో పర్యటించారు. చీరాల పట్టణం 9వ వార్డు లోని సెయింట్ మార్క్స్ లూధరన్ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని 98వ పోలింగ్ కేంద్రాన్ని, పర్చూరు నియోజకవర్గంలోని చిన్నగంజాం మండలం కడవకుదురు అంగనవాడి పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల కొరకు ర్యాంప్, రైలింగ్ నిర్మాణాలను పరిశీలించారు. ఓటర్ల జాబితా నుంచి మృతుల పేర్లను తొలగించే ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. అందుకు సంబంధించిన దస్త్రాలను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ

బిఎల్‌ఒలకు సూచనలిస్తున్న డాక్టర్ పోలా భాస్కర్

నిర్వహించారు. చీరాలలో 280పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక లక్ష 97 వేల 532 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 98నెంబర్ పోలింగ్ కేంద్రంలో 1,266మంది ఓటర్లు ఉండగా అందులో 614మంది పురుష ఓటర్లు, 656మంది మహిళ ఓటర్లు ఉన్నారని తెలిపారు. మృతుల ఓటర్ల తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. నూతన ఓటర్ల దరఖాస్తుల నమోదు, ఓటరు పేర్లు చేర్పులు, చిరునామాల మార్పులు విధివిధానాలపై కచ్చితంగా అవగాహన ఉండాలని చెప్పారు. బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని అధికారులకు సూచించారు. ఓటు హక్కు విలువ గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల నుంచి దరఖాస్తులు వచ్చేలా చైతన్య పరచాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని పొరపాట్లు, తప్పులు చేయరాదని అన్నారు. ఫిర్యాదు దారుడికి, సంబంధిత కుటుంబ సభ్యులకు ముందస్తుగా నోటీసులు ఇవ్వాలని అన్నారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి పి వెంకటరమణ, ఆర్డీఓ పి సరోజినీ, మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డి, తహశీల్దారు జె ప్రభాకరరావు, పర్చూరు ఈఆర్‌ఓ పివి నారాయణ, తహశీల్దారు పార్వతి ఉన్నారు. సమాచారం అందుకున్న పర్చూరు వైసిపి ఇన్చార్జ్ కృష్ణమోహన్ చిన్నగంజాం చేరుకుని రోల్ అబ్జర్వర్ ను కలసి వినతిపత్రం అందించారు.

జగనన్న సంక్షేమ పాలనను ప్రజలకు వివరించాలి

సంక్షేమ పదకాల బోర్డు ఆవిష్కరిస్తున్న సర్పంచి పృద్వీరాజ్

ప్రజాశక్తి - యద్దనపూడి

గత నాలుగున్నర సంవత్సరాలుగా వివిధ సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల ద్వాఆరా లబ్ధిదారులకు అందించిన నగదు వివరాలతో కూడిన బోర్డు మంగళవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం మండలంలోని యనమలదల సచివాలయం పరిధిలో నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ రాయి పృథ్వీరాజ్, సచివాలయ కన్వీనర్, వైసిపి నాయకులు మారెళ్ల శ్రీధర్, ఎంపిడిఒ టి కృష్ణ కుమారి, శ్రీనివాసరావు, ఇఒఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి రాణి, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ బాజీ, విఆర్‌ఒ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మాజీ సర్పంచి చుండూరి వాసు

వేటపాలెం : సచివాలయం పరిధిలోని ప్రజలకు రూ.15కోట్లకుపైగా విలువైన సంక్షేమ పథకాలు అందించినట్లు ఈఓఆర్డి సజ్జ శ్రీలక్ష్మి తెలిపారు. కొత్తపేట 3వ సచివాలయం పరిధిలో జగనన్న ఎందుకు కావాలనే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, మాజీ సర్పంచి చుండూరి వాసు, పిన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, కంచి సాంబిరెడ్డి, సీతామాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బి రమేష్ బాబు, సచివాలయం కార్యదర్శి వెన్నెల, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యులు పులి వెంకటేశ్వర్లు, జెసిఎస్ మండల ఇన్చార్జ్ లేళ్ల శ్రీధర్, సీతామహాలక్ష్మి, జంగిలి రామారావు, తాపీ యూనియన్ అధ్యక్షులు మారుబోయిన పాపారావు, చింతలపూడి తులసిరాం, డక్కుమల్ల రమేష్, పిన్నిబోయిన శ్రీనివాసరావు, మారుపోయిన శ్రీనివాసరావు, భాష, పృధ్వీ చంద్ర మోహన్, ఖాదర్, దంత హనుమంతు, జమ్మి ప్రసాద్ రెడ్డి, పురిమెట్ల వెంకటేశ్వర్లు, మధుర రవి, మిర్యల రాఘవ, బుద్ధి రవి పాల్గొన్నారు.

జగనన్న కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి లలితకుమారి

భట్టిప్రోలు : మండలంలోని పల్లికోన గ్రామంలో జగనే మా నమ్మకం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ డివి లలిత కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు అమలైన సంక్షేమ పథకాలు మరోమారు జగన్మోహన్ రెడ్డి సిఎం అయితేనే కొనసాగుతాయని చెప్పారు. ఇప్పటివరకు గ్రామానికి వివిధ రూపాల్లో అందిన రూ.34కోట్ల సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. వైసీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి తిరువీధుల ఉదయభాస్కర్, సర్పంచ్ బుల్లెట్ రాజమ్మ, మండల అధ్యక్షులు కె పిచ్చేశాస్త్రి, వైసీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి దున్న తిరుపతి బాబు, నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని దగ్గుబాడు పంచాయతీలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సర్పంచి రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ నాలుగు న్నర సంవత్సరాలుగా

సభలో మాట్లాడుతున్న సర్పంచి రవీంద్రనాద్ ఠాగూర్

ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా రూ.24కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఒ పి లక్ష్మీనారాయణ, ఈఒపిఆర్డి ఆర్ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి జోష్న పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పథకాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నేతలు

రేపల్లె : వై ఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని పట్టణంలోని 8, 9వ వార్డులకు సంబంధించిన సచివాలయాల పరిధిలో నిర్వహించినట్లు వైసీపీ నాయకులు, కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు చెప్పారు. సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని అన్నారు. 8, 9వ వార్డులకు సంభందించి రూ.కోట్లకుపైగా నిధులు వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఖర్చు చేశారని చెప్పారు. జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని తెలిపారు. కౌన్సిలర్ బేతపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 23వరకు పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించే దిశగా సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.

చీరాల వైసిపిలో బయటపడ్డ విభేదాలు

జగనన్న కార్యక్రమానికి దూరంగా కౌన్సిలర్లు

ప్రజాశక్తి - చీరాల

వైసిపిలో విభేదాలు భగ్గుమన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమానికి పట్టణంలోని కొందరు కౌన్సిలర్లు ముఖం చాటేస్తున్నారు. జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం వైసిపి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మరోసారి జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించే కార్యక్రమంలో స్థానిక నాయకులదే అధిక ప్రాధాన్యత. ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి, వైసిపి ఇంచార్జి కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు పట్టణంలో జరుగుతున్న ప్రభుత్వ ప్రచార కార్యక్రమం మంగళవారం పట్టణంలోని

వార్డు కౌన్సిలర్లు లేకుండానే జెండా ఆవిష్కరిస్తున్న ఛైర్మన్

పేరాల, గొల్లపాలెం సచివాలయంలో 5, 10, 11వార్డుల పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 5, 11వార్డుల కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి, తోకల అనీల్ ముఖం చాటేశారు. వైసిపి కౌన్సిలర్లు హాజరు కాకపోవడం విమర్శలకు కారణమైంది. ఎంఎల్ఎ తమకు ప్రాధాన్యత తగ్గించారనే కారణంతోనే ముఖం చాటేసినట్లు వైసిపి కార్యకర్తలే చర్చిస్తున్నారు. అదే క్లస్టర్ 2లోని 10వ వార్డ్ కౌన్సిలర్ గోలి స్వాతి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వచ్చింది. మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్ బాబు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. వైసిపి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెసిఎస్ పట్టణ ఇంచార్జీలు దాసరి రామకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, కౌన్సిలర్ బత్తుల అనిల్, కంపా అరుణ్, గోలి జగదీష్, వైసిపి నాయకులు షేక్ సుభాని, గోలి రవి, వాసిమల్ల వాసు, మామిడాల సుబ్బారావు, చిలుకోటి శ్రీను, మున్సిపల్ డిఇ ఐసయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
బుధవారం 22 నవంబర్ 2023

తెల్లశనగ సాగుపై రైతుల ఆసక్తి

• చాలీచాలని పదనులోనే విత్తన వెద • వర్ష సూచనతో వేచిచూస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఖరీఫ్‌తో పాటు రబిలోనూ రైతులను వర్షాభావం వెంటాడుతోంది. ఈపాటికే రబి సాగు జాప్యమైంది. దీంతో గత వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు భూమి చాలీచాలని పదును అయ్యింది. సరిపడునంత వర్షం కురిసిద్దో కురియదో అన్న అనుమానాలతో రైతాంగం ఆలస్యమైందన్న తొందరతో రబి పంటగా సెనగ సాగుకు ఉపక్రమించారు. వారం రోజుల నుంచి రబీ సాగులో భాగంగా నేలకు ఎరువులు వెదజల్లటంతో పాటు శనగ విత్తనాలు వెద పెడుతున్నారు. అయితే వాతావరణం మారి రోజు మబ్బులు చేస్తూ ఉన్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికలతో మళ్లీ వర్షం పడితే పెట్టిన విత్తనాలు వృధా అవుతాయన్న ఆలోచనతో కొదరు రైతులు ఉన్నారు. కొంత మంది రైతులు ఆలస్యమైన ప్పటికి వాతావరణం చూచి విత్తనయద పెట్టే ఆలోచనలో ఉన్నారు. తెల్ల సెనగ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. కాక్ టు, ఫులేజి లాంటి తెల్ల సెనగ రకాలుకు ధర బాగా ఉండటంతో ఎర్ర సెనగల కన్నాతెల సెనగసాగు వైపు రైతాంగం మొగ్గు చూపుతుంది. ఈ రకం క్వింటాలు ధర రూ.12వేల వరకు ఉంది. విత్తనాలకు మాత్రం కింటా రూ.13వేల వరకు వ్యాపారులు అమ్ముతున్నారు. జేజే లెవెన్ రకం ఎర్ర సెనగలు ధర క్వింటా రూ.5600 పలుకుతుంది. దీంతో రైతులు ఎర్ర శనగ సాగు కన్నా తెల్ల శనగ సాగు వైపే మొగ్గు చూపుతున్నారు.

ఇంకొల్లులో తెల్లశెనగ సాగుకు సిద్ధం చేసిన భూమి

టిడిపితోనే మత్స్యకారుల అభివృద్ధి

ప్రజాశక్తి - చీరాల

టిడిపి ప్రభుత్వంలో మత్స్యకారుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసిందని టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య అన్నారు. 70శాతం సబ్సిడీతో బోట్లు, ఇంజన్లు, వలలు, ఐస్ బాక్సులు, డీజిల్ సబ్సిడీ, జిపిఎస్ పరికరాలు అందించారని తెలిపారు. మత్స్యకార దినోత్సవ సందర్భంగా వాడరేవులో జనసేన, టిడిపి ఉమ్మడిగా మంగళవారం నిర్వహించిన సభలో అయన మాట్లాడారు. పిల్లల చదువు పట్ల బాధ్యతగా ఉండాలని చెప్పారు. మత్స్యకారులకు సంవత్సరానికి రూ.5వేలు ఇచ్చినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో 45శాతం మాత్రమే సబ్సిడీ యిచ్చిందని అన్నారు. వీటిపై రాయితీలు అందరికీ ఇవ్వకుండా

మత్స్యకార సభలో మాట్లాడుతున్న ఎంఎం కొండయ్య

33శాతం మత్స్యకారులకే ఇస్తూ మిగతా వారికి అన్యాయం చేశారని చెప్పారు. చంద్రన్న బీమా వలన మరణం సంభవిస్తే రూ.2లక్షలు, వేటకు వెళ్లి సముద్రం మీద చనిపోతే ప్రమాదం పరిహారం కింద రూ.5లక్షలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో యుక్తవయసులో ఎవరైనా చనిపోతే ఎలాంటి భీమా ఇవ్వడంలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి టిడిపి గెలిపించుకోవాలని కోరారు. చంద్రబాబుకు మద్దతు పలకాలని మత్స్యకారులను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నక్కల రమణారావు, పొగడదండ రవి, ఎం గౌరీ అమర్నాథ్, డేటా నాగేశ్వరరావు, గంజి పురుషోత్తం, అనపర్తి రత్నబాబు, గరికన కాశీరావు, ఓసిపిల్లి తాతారావు, కోనాడ సూర్యారావు, కొవ్వూరి పెంటయ్య, బందు గురవయ్య, గరికన చిన్న, చొక్కా రాంబాబు, జనసేన నాయకులు తాడికొండ విజయ్ కుమార్, మద్దాల మహేష్, గంగిరి చిన్నారావ్, బలగం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దారు

'ఓటు హక్కు అత్యంత విలువైంది'

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు దూళిపూడి వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక కెఎస్‌కె మహిళా డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు మానవుని ప్రాథమిక హక్కు అని అన్నారు. రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన ఈ ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగం చేసుకోవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. యువత ఓటు వినియోగంలో ప్రముఖ పాత్రధారులు కావాలని అన్నారు. అలాగే నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకొని సమర్థవంతమైన పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం హక్కును కల్పించిందని అన్నారు. యువతీ, యువకులు దేశ నిర్దేశకులని అన్నారు. ఓటు హక్కు ఉంటేనే పాలకులను ఎన్నుకోగలుగుతారని అన్నారు. వివేకంతో సత్ప్రవర్తన కలిగిన నేతలను ఎన్నుకుంటే మెరుగైన పరిపాలన అందుతుందని అన్నారు. ఓటు హక్కు ద్వారానే ప్రజాస్వామ్యం కాపాడగలమని చెప్పారు. మెరుగైన సమాజ నిర్మాణానికి, రాజ్యాంగం అమలుకు ఓటు హక్కు కీలకమైనదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ప్రాధన్యతను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని చెప్పారు. ఓటు హక్కు కోసం ధరకాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్ఓ ప్రసాద్, రాజేష్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిసిల అభ్యున్నతికే కులగణన

కులగణన శిక్షణలో మాట్లాడుతున్న డిఇఒ రామారావు

ప్రజాశక్తి - బాపట్ల

సామాజికంగా వెనుకబడిన వర్గాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కుల గణన సర్వే చేపట్టిందని మండల ప్రత్యేక అధికారి, డిఇఒ పివిజె రామారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్, గ్రామ రెవెన్యూ అధికారులకు కుల గణనపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. కులగణన పారదర్శకంగా, నిస్పాక్షికంగా నిర్వహించాలని అన్నారు. ప్రజల్లో సందేహాలను నివృత్తి చేయాలని అన్నారు. ప్రజల్లో అపోహలను తొలగించాలని అన్నారు. సర్వే పట్ల విశ్వసనీయత పెంచేందుకు ఉద్యోగులు కృషి చేయాలని అన్నారు. కుల గణన ద్వారా వచ్చే గణాంకాలతో బడుగు వర్గాల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం రూపొందించే అవకాశం ఉందని అన్నారు. ఉద్యోగులు సమన్వయంతో అంకిత భావంతో పనిచేయాలని అన్నారు. ఇంచార్జ్ ఎంపీడీఒ పులి శరత్ బాబు మాట్లాడుతూ ఈనెల 27 నుండి డిసెంబర్ 3 వరకు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి కులం, ఉప కులం, కుటుంబ సభ్యుల వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన యాప్ ద్వారా నమోదు చేయాలని అన్నారు. డిప్యూటీ తహసీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ కులగణన నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సర్వే సందర్భంలో కుటుంబ సభ్యులను కొత్తగా చేర్చుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని అన్నారు. కులగణనపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.

సంతమాగులూరు : బిసిల అభ్యున్నతికే ఈనెల 27నుండి డిసెంబరు 3వరకు కుల గణన సర్వే విజయవంతం చేయాలని డిప్యూటీ తహశీల్దార్ రాఘవులు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, రెవెన్యూ అధికారులు, వాలంటీర్లకు కుల గణనపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. కుల గణన సర్వే ద్వారా వచ్చే గణాంకాలతో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కుల గణన సర్వే చేపట్టిందని తెలిపారు. ఉద్యోగులు సమన్వయంతో, అంకిత భావంతో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వై ఎలమంద, ఎంపీడీఒ ఎన్ శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న తహశీల్దారు రాఘవులు

వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవాలు

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు గ్రామం బీసీ కాలనీలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ మూడవ వార్షికోత్సవాలు ఈ నెల 22న బుధవారం నుండి జరుగుతాయని ఆలయ నిర్వాహకులు వసంతాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రజలు, భక్తులు అత్యధికంగా పాల్గొని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని ప్రార్థించారు.

సివి రామన్ చిత్రపటం బహుకరించిన పూర్వ విద్యార్థి

సివి రామన్ చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి - నగరం

ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్తలు సివి. రామన్, సత్యేంద్రనాథ్ బోస్ చిత్రపటాలను శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల పియుసి మొదటి బ్యాచ్ (1969-70) విద్యార్థి డాక్టర్ వైవీఎస్ రామకృష్ణ కళాశాలకు బహూకరించారు. ప్రస్తుతం హైదరాబాదులోని ప్రముఖ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న రామకృష్ణ తమ కుటుంబ సభ్యులు ద్వారా, సివి రామన్ వర్ధంతి సందర్భంగా నేడు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరికి అందజేసారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ చదువుకున్న కళాశాల పట్ల అభిమానంతో నేటి తరం విద్యార్థులకు శాస్త్రవేత్తల గురించి తెలిసేలా వారి చిత్రపటాలను అందించినందుకు అభినందనలు తెలిపారు. కళాశాలలో విద్యను పూర్తి చేసుకుని 50సంవత్సరాలైనా కళాశాల పట్ల మక్కువ చూపడం అభినందనీయమని అన్నారు. రామకృష్ణ అందించిన చిత్రపటాలను కళాశాల భౌతికశాస్త్ర ప్రయోగశాలలో ఏర్పాటు చేయిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాగంటి సుధాకరరావు, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పంచుమర్తి శ్రీనివాసరావు, అమరేష్‌రెడ్డి, అధ్యాపకులు కామేష్, హిరణ్మయి పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి కరపత్ర ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో బాబు షఉరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. భూత్ ఇన్చార్జులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇన్చార్జీలు, విడివిడిగా గ్రూపులుగా ఏర్పడి ప్రతి ఇంటినీ కలసి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలు మంగళవారం పంచారు. బూతుల వారీగా ప్రచారం నిర్వహించారు. టిడిపి అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ నినాదంతో రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వామనపల్లి కోటేశ్వరరావు, మాచర్ల నాగరాజు, అనగాని ఏడుకొండలు, తాతా వీరాంజనేయులు, దీపాల ప్రసాద్, జగ్గారపు పాపారావు, బాబు, మద్దాల రమేష్ పాల్గొన్నారు.

స్టీవెన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్రంలోని విశాఖపట్నం, గుంటూరు, ప్రకాశం జిల్లాలోని మత్స్యకారుల ఆర్థిక, సామాజిక, స్థితిగతులపై చేసిన పరిశీలనకు పట్టణంలోని ఉడ్ నగర్‌కు చెందిన మెడబలిమి స్టీవెన్ బాబుకు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుండి అర్థ శాస్త్ర విభాగంలో గౌరవ డాక్టరేట్ పిహెచ్‌డీ మంజూరు చేశారు. ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ అధిపతి అయిన డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆయన పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా హెచ్ ఓ డి కె మధు బాబు, పలువురు మిత్రులు అభినందించారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా డాక్టరేట్ అందజేశారు.

మెడబలిమి స్టీవెన్‌బాబు



మత్స్యకార భరోసా కింద వాహనాలు అందజేస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

వేట సమయంలో

నిర్దేశించిన వలలనే వాడాలి

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు ప్రభుత్వ వారు నిర్దేశించిన వలలనే వాడాలని, చిన్న చేపలను వేరు చేయరాదని ఈ విషయాన్ని పాటించడం వల్ల మత్స్య సంపద పెరిగి నాణ్యమైన పెద్ద సైజు చేపలతో మత్స్యకారుల ఆదాయం పెరుగుతుందని బాపట్ల సభ్యులు కోన రఘుపతి తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లోని డిఆర్సి కార్యాలయంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ జిల్లాలో నిజాంపట్నం, వాడరేవుల్లో రూ.902 కోట్లతో షిప్పింగ్ హార్బల్ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. నిజాంపట్నం దిండి గ్రామం వద్ద రూ.88 కోట్లతో ఆక్వా పార్క్ నిర్మించనున్నట్లు చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బెస్ట్ మెరైన్ అవార్డు ఆంధ్రప్రదేశ్ కు రావడం అభినందనీయమన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మంజూరైన చేపల రవాణా వాహనాలు మరియు ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా మంజూరైన ఫిష్ కియోక్స్ లకు సంబంధించిన మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. జలాశయాల్లో నదుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమాల్లో భాగంగా సముద్రంలో కూడా చేప పిల్లలు, రొయ్య పిల్లలు వదిలే కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షులు భూ శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా మత్స్య శాఖ అధికారి డాక్టర్ పి సురేష్. మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, కన్నా మామిడయ్యా, కొల్లాటి ఏడుకొండలు, నిజాంపట్నం మెకనైజ్డ్ బోర్డు ఓనర్ల సంఘం అధ్యక్షులు మోపిదేవి శ్రీనివాస్, జిల్లా మత్స్య శాఖ అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

రిమ్స్ మెడికల్ కళాశాలలో

వైద్య విద్యార్థుల కొట్లాట

- రెండు గ్రూపులుగా విడిపోయి ఘర్షణ - గంజాయి, కులాల గొడవ కాదు..: డీఎస్పీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలులోని ప్రభుత్వ రిమ్స్ వైద్య కళాశాలలో మెడికల్ విద్యార్థులు క్లాస్‌రూంలో తన్నుకున్నారు. సినిమాలలో ఫైట్ సీన్లను తలపించేలా పిడిగుద్దులు గుద్దుకున్నారు. వీధి రౌడీలను తలపించేలా క్లాస్‌రూం బల్లలపై పడి కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో పలువురి విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ఘటన గత సోమవారం జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఫిర్యాదులు రావడంతో కొంతమంది విద్యార్థులను నాలుగు మాసాల కిందట కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది. వారు తిరిగి ఇటీవల కళాశాలకు వచ్చారు. గతంలో వారిమీద ఫిర్యాదు చేసిన విద్యార్థులపై దాడికి దిగారు. సహచర విద్యార్థులు, ముందే చితక్కొట్టుకున్నారు. ఇది చూసిన తోటి విద్యార్థులు హడలిపోయారు. ఈగొడవను కొంతమంది విద్యార్థులు వారి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడంతో ఆ వీడియోలు మంగళవారం వైరల్‌గా మారాయి. రిమ్స్ మెడికల్ కళాశాలలో క్రమశిక్షణ లోపించిందనే విమర్శలున్నాయి. వైద్య కళాశాలలో విద్యార్థులు ఇలాంటి ఘటనలకు పదే పదే పాల్పడటం మెడికల్ కళాశాల ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి.

ఆ ప్రచారంలో వాస్తవం లేదు..: డీఎస్పీ

మెడికల్ కళాశాలలో గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్న ఇరువర్గాల విద్యార్థులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి తెలిపారు. మంగళవారం తాలుకా పోలీసుస్టేషన్‌లో రిమ్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఏడుకొండలుతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్నట్లు మెడికల్ కాలేజీ విద్యార్థులు గంజాయి కోసం క్లాస్‌రూం లో కొట్టుకున్నారని, ఎస్సీలు మరియు ఇతర వర్గాలుగా విడిపోయి కొట్టుకున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వాస్తవానికి మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోయారని, హాస్టల్ మెస్ విషయంలో కొంతమంది కాంట్రాక్టర్ ద్వారా మెస్ నడపాలని, కొంతమంది విద్యార్థుల ద్వారా నడపాలని గత కొంతకాలంగా వివాదం జరుగుతోందన్నారు. కొంతమంది మద్యం తాగివచ్చి న్యూసెన్స్ చేస్తున్నందున ఈ ఏడాది ఆగష్టు నెలలో కళాశాల ప్రిన్సిపల్, కమిటి వాళ్లు విచారణ జరిపి మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులపై చర్యలు తీసుకొని వారిని హాస్టల్ నుంచి బయటకు పంపారని తెలిపారు. వారు హాస్టల్ బయట నుంచి క్లాస్‌లకు హాజరువుతున్నారని వివరించారు. వారు ఆ విధంగా హాస్టల్‌లో లేకుండా చేయడానికి కొంతమంది మూడో సంవత్సరం విద్యార్థులని భావించిన సస్పెండ్ అయిన విద్యార్థులు గత రెండు రోజుల కిందట ఓ గ్రూపు విద్యార్థుల మీద దాడికి దిగడం జరిగిందన్నారు.

గొడవ ఇలా జరిగింది..

గొడవ జరిగిన విధానాన్ని డిఎస్పీ వివరించారు. ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం రెండు.. మూడు గంటల మధ్యలో ఈఎన్‌టి క్లాస్‌లో ఇద్దరు విద్యార్థులు సెమినార్ ఇస్తుండగా దానిపై కామెంట్స్, ప్రతి కామెంట్స్ చేసుకొని క్లాస్‌లో లెక్చరర్ వెళ్లిపోయిన తరువాత విద్యార్థులు ఒకరిపై ఒకరు కాళ్లు, చేతులతో దాడులు చేసుకున్నారని తెలిపారు. దీన్ని ఒక మహిళా విద్యార్థి సెల్‌ఫోన్‌లో వీడియో తీయడం జరిగిందన్నారు. ఆ తరువాత ఇరువర్గాల విద్యార్థులు ఇంచార్జి ప్రిన్సిపల్ వెంకటరమణకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అనంతరం సాయంత్రం కాలేజీ బయట డార్విన్ మెడికల్ షాప్ వద్ద మధ్యాహ్నం గొడవలో ఉన్న ఇద్దరు విద్యార్థులు కనపడగా వారిలో ఒకరిని సస్పెండ్ అయిన గ్రూపు వారు చేతులతో కొట్టి సంఘమిత్ర ఆసుపత్రి వద్ద ఉన్న టీ షాపు వద్దకు వెళ్లగా మరొక వర్గానికి చెందిన వారు వెళ్లి రాత్రి 8.30 గంటలకు గొడవ పడ్డారని తెలిపారు. ఆ గొడవలో ఒక వర్గానికి చెందిన యశ్విన్, మరొక వర్గానికి చెందిన గిరిధర్‌కు గాయాలయ్యాయని వివరించారు. ఇతరులకు చిన్న గాయాలయ్యాయని తెలిపారు. యశ్విన్ గవర్నమెంటు ఆసుపత్రిలో చికిత్స పొందగా గిరిధర్ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందారని తెలిపారు. ఈ గలాటాలో రెండు గ్రూపుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇది కులాల మధ్య గొడవ కాదని స్పష్టం చేశారు. గంజాయి కొరకు జరిగిన గొడవ కూడా కాదన్నారు. వ్యక్తిగతంగా, అనవసరంగా, ఆకస్మికంగా క్లాస్ రూంలో జరిగిన గొడవని వివరించారు. ఈ గొడవకు కారణమైన ఇరు వర్గాల విద్యార్థుల మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డిఎస్పీ వెల్లడించారు. విలేకర్ల సమావేశంలో ఒంగోలు తాలుకా సిఐ భక్తవత్సల రెడ్డి, వన్‌టౌన్ సిఐ ఎం లక్ష్మణ్ పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా

పక్షోత్సవాలను జయప్రదం చేయండి

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సమాజంలో రోజురోజుకీ మహిళలపై పెరిగిపోతున్న హింసకు వ్యతిరేకంగా ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం వరకు పక్షం రోజులపాటు హింస వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

సయ్యద్ షర్మిల అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగుతున్న క్రైమ్ రేటు విపరీతంగా పెరుగుతుందని, దేశంలో ఏదో ఒక మూల ప్రతి నిమిషానికి ఒక అఘాయిత్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యంతో పాటు రాష్ట్రంలో మత్తు పదార్థాల వాడకం పెరిగిందని, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు పెరిగేందుకు దారి తీస్తున్నాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలు నిషేధించాలని, హింసను అరికట్టాలని ఈనెల 25 నుంచి మానవ హక్కుల దినోత్సవం అయిన డిసెంబర్ 10 వరకు 15 రోజులపాటు ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా నాయకురాళ్ళు యన్.మాలతి, జి.ఆదిలక్ష్మి, ఏ. సీతామహాలక్ష్మి, జి.భానుమతి, కె ప్రసన్న, ఎస్కె బషీర, డి శారా, ఎస్కె రెహానా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెఎసి నాయకులు

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీరాల

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని జెఎసి జిల్లా నాయకులు కిషోర్‌బాబు కోరారు. చీరాల మున్సిపాలిటీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ బాపట్ల జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్లో డిసెంబర్ 10వ తారీఖు జరగనున్న రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మొదటి సభ గురించి మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీరాల మున్సిపాలిటీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన హాస్టల్‌లో

విద్యార్థులను ఉంచడం తగదు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్
- ఎస్‌సి బాలికల-1 హాస్టల్ సందర్శన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

శిథిలావస్థకు చేరిన వసతిగృహాలలో విద్యార్థులను ఉంచటం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలోని ఎస్సీ బాలికల -1 కళాశాల వసతి గహాన్ని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిహెచ్ వినోద్ మాట్లాడుతూ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయన్నారు. మరుగుదొడ్లకు డోర్లు లేవని, కిటికీలకు దుప్పట్లు అడ్డం పెడుతున్నార న్నారు. మంచినీళ్ల పైపులు లీక్ అయ్యి పరిసర ప్రాంతాలు అసభ్యంగా ఉన్నాయన్నారు. ఈ భవనం ప్రైవేట్‌ది అయినా మార్చమని పలు దఫాలుగా అడుగుతున్న స్థానిక రాజకీయ

హాస్టల్‌ను సందర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ, ఐద్వా నేతలు

నాయకుడు భవనం కావటంతో మార్చడానికి అధికారులు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. దీంతో విద్యార్థుల అసౌకర్యాల మధ్య మగ్గుతున్నారని, ఒకవైపు ప్రభుత్వం మాది సంక్షేమ ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూ మరోవైపున పేద పిల్లల హాస్టళ్ళ పై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. కలెక్టరేట్ కు సమీపంలో ఉన్న ఈ హాస్టల్‌లోనే ఇన్ని సమస్యలు ఉంటే జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న హాస్టల్స్‌లో పరిస్థితి ఇంకేలా ఉంటుందో ఆలోచించాలన్నారు. తక్షణం ఈ హాస్టల్ ను మార్చి మరో భవనంలోకి విద్యార్థులను పంపాలి లేకపోతే ఈ సమస్యపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శు లు ఎస్‌డి షమ్మి, కంకణాలు రమాదేవి, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.